క్లుప్తంగా

హెచ్ఎంల సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడిగా కోలా ఎంపిక



సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోలా సత్యనారాయణ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో హెచ్ఎమ్ సత్యనారాయణను రెండవసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల ఆత్మగౌరవ సమస్యగా ఉన్న పదోన్నతుల సాధనకు రాష్ట్ర సంఘంతో కలసి కృషి చేస్తానని అన్నారు. తన ఏకగ్రీవ ఎన్నికను సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరు రవి, ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు, సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలి

సీతానగరం: స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఆవిష్కాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఆవిష్కాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులతో ఆవిష్కాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ మాధవ్, నాగేశ్వరరావు, డాక్టర్ సుధామయి, అలేఖ్య పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన తన కుమార్తె ఏళ్ల రత్నకుమారి (30) కనిపించడం లేదని తల్లి యర్రగోగిల పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి రామ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లో ఉంటున్న పార్వతి తన కుమార్తెను రఘుదేవపురానికి చెందిన మేడిశెట్టి శివకృష్ణకు ఇచ్చి వివాహం చేశామన్నారు. గత నెల 17న భార్యాభర్తలు ఇరువురు గొడవపడ్డారు. తరచూ దాడి చేసి కొడుతున్నాడని రత్నకుమారి తన తల్లికి ఫోన్ చేసింది. అప్పటి నుంచి రత్నకుమారి కనిపించడం లేదని ఆమె తల్లి పార్వతి తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో పార్వతి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు

బిక్కవోలు: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలుకు చెందిన మహిళ గత నెల 30 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త గణేష్ కుమార్ తెలిపారు. బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా ఆమె ఆచూకీ తెలియక పోవడంతో గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పరిశీలన

కోరుకొండ: అటల్ టింకరింగ్ ల్యాబ్ జిల్లాస్థాయి హబ్ సెంటర్ల పరిశీలన కోసం ముగ్గురు సభ్యులతో కూడిన రాష్ట్రస్థాయి సర్వే బృందం కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వచ్చింది. ఈ బృందంలో బెంగుళూరు, హైదరాబాద్‌కు చెందిన రితీష్‌కుమార్, కావ్య, హాల్సీ ఉన్నారు. ఈ బృందం సోమవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రశ్నిస్తూ, ప్రయోగాలు, చేపట్టిన ప్రాజెక్టులపై ఆరా తీశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ, స్కూల్ హెచ్ఎం రామారావు రెడ్డి, ఏటీఎల్ ఇన్‌చార్జులు బీఎల్‌వీఎన్ ఆనందబాబు, జె. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

త్రిముఖలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బిక్కవోలు: కొంకుదురు బుడతల మామిడి వద్ద కొలువైన ఉన్న శ్రీ బాల త్రిపుర సుందరి సమేత త్రిముఖలింగేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో అర్చనలు

బిక్కవోలు: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా పందలపాక వెలంపేట రామాలయం వద్ద కొలువైన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయానికి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. తొస్సిపూడి, కొమరిపాలెం, కొంకుదురు, బలభద్రపురంలో గణేశ్ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.



రాజానగరం సినిమా థియేటర్ వద్ద పాడైన పాత జాతీయ రహదారి



ఏడీబీ రోడ్డుపై రాజానగరం జంక్షన్‌లో వర్షం నీరు

వర్షాలు.. ఛిద్రమైన రహదారులు

- వాహనచోదకులకు పగలే చుక్కలు చూపుతున్న గోతులు
- నాణ్యత, నిర్వహణ లోపాలే కారణం

రాజానగరం: ప్రగతికి సోపానులుగా పేర్కొనే రోడ్లు ఛిద్రమై ప్రయాణికులకు పగలే చుక్కలు చూపిస్తున్నాయి. రోడ్లు గోతులమయమై ఎక్కువ రోజులు వర్షం నీరు నిలిచిపోవడంతో గుంతలు పడుతున్నాయి. ఇదే సమయంలో భారీ వర్షాలు ఆ గుంతలను చెరువుల్లా తయారయ్యేందుకు తోర్పడుతున్నాయి. 16వ నంబరు జాతీయ రహదారితోపాటు రాజానగరం, అనపర్తి నియోకవర్గాల్లో 1,056 కి.మీ. మేర ఆర్‌అండ్‌బీ, జెడ్పీ, పంచాయతీరాజ్, గ్రామీణ రోడ్లు విస్తరించి ఉన్నాయి. వీటిలో 352 కి.మీ. మినహా మిగిలిన రోడ్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలావరకు ఛిద్రమయ్యాయి. గుంతలుమయమైన రోడ్లపై ప్రయాణించాలంటేనే వాహనచోదకులు హడలిపోతున్నారు.

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో రోడ్ల పరిస్థితులు

రాజమహేంద్రవరం నుంచి కాకినాడ, విశాఖపట్నం పట్టణాలకు ప్రయాణించేందుకు వీలుగా 16వ నంబరు జాతీయ రహదారి రాజానగరం మీదుగా వెళ్తుంది. ఈ మండలంలో సుమారు 26 కి.మీ. వరకు ఈ రహదారి విస్తరించి ఉండగా, ఇక్కడ నుంచి కోరుకొండ, సీతానగరం మండలాలను కలుపుతూ ఆర్ అండ్‌బీ, జెడ్పీ, పంచాయతీరాజ్ రోడ్లు 496 కి.మీ. వరకు విస్తరించి ఉన్నాయి. అనపర్తి మీదుగా కాకినాడ, రాజమహేంద్రవరం, మండపేటను కలిపే ప్రధాన రహదారితోపాటు బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాలను అనుసంధానిస్తూ ఆర్‌అండ్‌బీ, జెడ్పీ రోడ్లు 560 కి.మీ. వరకు ఉన్నాయి. వీటిలో ఆర్ అండ్‌బీ, జెడ్పీ, పంచాయతీరాజ్ రోడ్లు చాలావరకు పాడైపోయి ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. రాజానగరం నుంచి కలవచర్ల మీదుగా గాదరాడకు ఉన్న రోడ్డును అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వంలో చర్యలు తీసుకోవడం లేదు. ఈ రోడ్డుపై ప్రయాణించలేక, ఆయా గ్రామాల ప్రజలు గండేపల్లి మండలం, మురారి మీదుగా చుట్టూ తిరిగి ప్రయాణం సాగిస్తున్నారు. ఏడీబీ రోడ్డుపై మండలంలోని రామస్వామిపేట వద్ద అభివృద్ధి పనులు పూర్తికాలేదు. మార్జిన్లలో భారీ వాహనాలు దిగబడి, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. గోతులతో నిండివున్న ఈ రోడ్డుపై ప్రయాణం నరకయాతనగా మారిందని వాహనదారులు వాపోతున్నారు.16వ నంబరు జాతీయ రహదారి భారీ వర్షాలకు గుంతలమయంగా మారింది.

నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు

రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం విమర్శలు తావిస్తోంది. నిర్వహణ లోపాల కారణంగా రోడ్లు త్వరగా పాడైపోతున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అంటూ నేడు యంత్రాలతో రోడ్లను వేగంగా నిర్మించి నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనివలన అనతికాలంలోనే రోడ్లు గోతులమయంగా దర్శనమిస్తున్నాయి. గతంలో రోడ్లపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండేవారు. ఆ విధమైన సిబ్బంది నియామకాలు లేకపోవడంతో రోడ్లపై శాఖాపరమైన పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ఆక్రమణలు తోడవడంతో రోడ్లపై కురిసిన వర్షం నీరు కూడా దిగువ పోయేందుకు సరైన మార్గాలు కరువయ్యాయి. ఎక్కడికక్కడ రోజుల తరబడి నీరు నిలిచి రోడ్లు వేగంగా దెబ్బతింటున్నాయి. కొన్నిచోట్ల రోడ్లపైనే మురుగునీరు ప్రవహించడంతో గోతులు పడుతున్నాయి. ఇటువంటి పరిస్థితులతో సిమెంటు రోడ్లు కూడా పాడైపోయి, మట్టిరోడ్లుగా మారిపోతున్నాయి.

రోడ్డుపైకి మురుగునీరు



రోడ్ల నాణ్యత అంతంత మాత్రంగా ఉంటున్న నేపథ్యంలో కాస్త నీరు నిలబడితే చాలు గోతులు ఏర్పడుతున్నాయి. గతంలో రోడ్లపై ఎక్కడా నీరు నిలబడకుండా తగిన పర్యవేక్షణ ఉండేది. నేడు పర్యవేక్షణ లోపించడంతో సంపత్‌నగరం వంటి అనేక ప్రాంతాల్లో రోడ్ల పైనే నీరు నిలబడిపోతోంది. దీంతో రోడ్లు త్వరగా పాడై, గోతులు పడుతున్నాయి.

– సుంకర వెంకట్రావు, రాజోలు

ఎక్కడికక్కడ భారీ గోతులు



రాజానగరంలో పాత జాతీయ రహదారికి మరమ్మతులు చేసి ఏడాది కాలేదు, అప్పుడే ఎక్కడికక్కడ భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా సినిమా థియేటర్ వద్ద రాకపోకలు సాగించేందుకు కూడా వీలులేనంతగా రోడ్డు దెబ్బతింది. ఇక్కడ ఉన్న కల్వర్టులు మూసుకుపోయి దశాబ్దాలు కావొస్తున్నా పాలకులు పట్టించుకోలేదు.

– సత్తి త్రిమూర్తులు, శ్రీరామనగర్

వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించండి

అనపర్తి : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అనపర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 8:30 గంటలకు అనపర్తి కెనాల్ రోడ్డులో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. ఉదయం 10:30 గంటలకు బిక్కవోలులో వైఎస్సార్ సెంటర్‌లో ఉదయం 11 గంటలకు పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం అక్కడ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాలకు ఆయా ప్రాంతాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై ఘనంగా నివాళులర్పించాలని ఆయన కోరారు.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ



పాఠశాలకు ఫర్నిచర్‌ను అందజేసిన ప్రధానోపాధ్యాయుడు

రాజానగరం: వెలుగుబంద జెడ్పీ ఉన్నత పాఠశాలకు టేబుల్, చైర్, చిన్న బీరువా, నాలుగు ప్లాస్టిక్ కుర్చీలను హెచ్ఎం వై. అగ్నేశ్వరరావు సోమవారం వితరణగా అందజేశారు. ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ సమక్షంలో వీటిని ఆయన అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు



సీతానగరం మండల పరిషత్‌లో ఏవో సుబ్రహ్మణ్యంకు అర్జీ అందిస్తున్న ఈశ్వరుడు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలను అధికారులు అందుకున్నారు. సోమవారం మండల పరిషత కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎంపీడీవో ఎమ్ భారతి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో సుబ్రహ్మణ్యం అర్జీలను అందుకున్నారు. చినకొండేపూడి – చీపురుపల్లి రోడ్డు నుంచి రాపాక వెళ్లే పుంతరోడ్డును పునర్నిర్మించాలని చినకొండేపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం చైర్మన్ పోలినాటి ఈశ్వరుడు అర్జీ అందించారు. విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం వలన తల్లికి వందనం నగదు రాలేదని, సరిచేసి ఇప్పించాల్సిందిగా వెదుళ్లపల్లికి చెందిన పి కళావతి కోరారు. భార్యాభర్తలు విడిపోవడంతో గతంలో డ్వాక్రా సంఘం ద్వారా తీసుకున్న రుణం చెల్లించడం లేదని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా సభ్యురాలిపై చర్యలు తీసుకోలేదని పురుషోత్తపట్నంకు చెందిన పి.వెంకటరమణ అర్జీ అందించారు. తన స్థలంలో ఇల్లు ఉందని, ఇంటి పన్నుకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ మునికూడలికి చెందిన చిడిపి శ్యామ్‌కుమారి కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, టైపిస్ట్ సతీష్ పాల్గొన్నారు

3న ఎలుకల నివారణ మందు పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ మండలాధికారి సత్యప్రసాద్

పెదపూడి: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 3న ఎలుకల నివారణ మందు ఉచితంగా రైతులకు పంపిణీ చేస్తామని వ్యవసాయశాఖ మండలాధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు, పెదపూడిలో గ్రామ వ్యవసాయ సహాకుల, వ్యవసాయ విస్తరణ అధికారికి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు బ్రోమోడయోలిన్ అనే ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించి ఎలుకల నుంచి పంట రక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిమజ్జనోత్సవంలో జాగ్రత్తలు పాటించాలి

బిక్కవోలు: గణేశ్ నిమజ్జనోత్సవాన్ని శాంతియుతంగా, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా నిర్వహించాలని తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ ఉత్సవ కమిటీలకు సూచించారు.సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనం సమయంలో చిన్నారులు ,మహిళలు, వృద్ధులు దూరంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమస్యలు రాకుండా అందరూ అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీడీవో శ్రీనివాస్, పరిపాలనా అధికారి నాగేంద్ర ప్రసాద్, ట్రైనింగ్ ఎస్సై రవీంద్ర బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ అఖిల, ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని మహాత్మాజ్యోతీరావు పూలే ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ జి.అఖిల సోమవారం ప్రకటనలో ఈ విషయం తెలిపారు. మండపేటలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని కె.హేమలత జూనియర్స్, ఉమెన్స్ విభాగంలో, ఎనిమిదో తరగతి విద్యార్థిని యు.ప్రణీత వుమన్స్ విభాగం, పూర్వపు పదో తరగతి విద్యార్థిని కె.గౌతమి జూనియర్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ ముగ్గురూ త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కాగా.. ఆ విద్యార్థినులతో పాటు పీఈటీ కోట రమ్యను ప్రిన్సిపాల్ అఖిల, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రబంధాలలో సరస్వతీ స్తుతి తప్పనిసరి



రాంభట్ల పార్వతీశ్వర శర్మను సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

సీటీఆర్ఐ: ప్రాచీన ప్రబంధాలలో సరస్వతీ స్తుతి తప్పని సరిగా కనిపిస్తుందని శతావధాని డాక్టర్ రాంభట్ల పార్వతీశ్వర శర్మ అన్నారు. గోదావరి గట్టున ఉన్న ఆంధ్ర యువతీ కళాశాలలో జరుగుతున్న 54వ సరస్వతీ సపర్యా మహోత్సవాలలో భాగంగా, సోమవారం ఆయన 'ప్రబంధ కవుల సరస్వతీ సపర్య' అనే అంశంపై ప్రసంగించారు. పోతనాది మహాకవులు భాగవత పురాణంలో ఇష్ట దేవతా స్తుతిలో చేసిన సరస్వతీదేవి స్తుతులు అత్యంత ప్రాచుర్యం పొందాయన్నారు. శ్రీనాథుని శృంగార నైషధం, పింగళి సూరన్న రచించిన ప్రభావతీ ప్రద్యుమ్నం తదితర రచనల్లో సరస్వతీదేవి పాత్ర కూడా కనిపిస్తుందన్నారు. తెనాలి రామలింగకవి సరస్వతీ దేవిని పరమశివుని సోదరిగా వర్ణించాడన్నారు. మంగళవారం శతావధాని డాక్టర తాతా సందీప్ కిరాతార్జునీయం అంశంపై ప్రసంగిస్తారు.

విద్య నేర్పిన గురువులను గౌరవించాలి



రంగంపేటలో హైస్కూల్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జీఆర్టీ ప్రతినిధులు

రంగంపేట: అజ్ఞాన చీకట్లను తొలగించి విజ్ఞాన జ్యోతులు వెలిగించే గురువులను బాల్యం నుంచి గౌరవించడం అలవర్చుకోవాలనే లక్ష్యంతో గురువులను ఏటా సత్కరిస్తున్నామని రాజమహేంద్రవరం జీఆర్టీ జ్యువెలర్స్ మేనేజర్ సీహెచ్ రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి.పార్థసారథి అధ్యక్షతన నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ రంగంలో ఉన్నా, ఎంత ఉన్నత స్థితికి ఎదిగినా చదువు నేర్పిన గురువులను మరువరాదని ఆయన కోరారు. ఈ సందర్భంగా జీఆర్టీ సంస్థకు ప్రధానోపాధ్యాయుడితోపాటు ఆంగ్లోపాధ్యాయుడు వీసీ జాకబ్ తదితరులు కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, సిబ్బందిని గోల్డెన్ గురూస్ అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు ఎంఎస్ఆర్ నాయుడు మిమిక్రీ ఆద్యంతం అలరించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జీఆర్టీ సిబ్బంది గుణాల్, శ్రీనివాస్, రాంబాబు, రాణీ, మంగ పాల్గొన్నారు.

పేరమాంబ సాహిత్య సేవలు ఆదర్శనీయం



జాతీయ పురస్కారం పొందిన ఉపాధ్యాయిని పేరమాంబను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: ఉత్తమ విద్యా బోధన, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక అంశాలను స్పృశిస్తూ రాసిన అనేక తెలుగు గేయాలు, పద్యాలు, గద్యాలు, కవితలు, వ్యాసాలు, తదితర సాహిత్య రచనలతో విశిష్ట సేవలు అందిస్తున్న స్థానిక తెలుగు భాషోపాధ్యాయురాలు డాక్టర్ శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతి పేరమాంబ నేటి ఉపాధ్యాయలోకానికి ఆదర్శప్రాయురాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అభినందించారు. సోమవారం స్థానిక హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాదుకు చెందిన గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో శ్రీ సాయి లీలామృతం నిత్య పారాయణ గ్రంథ సాహిత్య రచనకు గిడుగు జాతీయ సాహితీ పురస్కారం అవార్డు అందుకోవటం అభినందనీయమన్నారు. గత నెల 31న హైదరాబాదు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్లో సంస్థ అధ్యక్షుడు గిడుగు క్రాంతి కృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బిక్కి కృష్ణ, ఎన్టీఆర్ లిటరేచర్ అండ్ గ్లోబల్ నెట్‌వర్కింగ్ కమిటీ, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారని తెలిపారు. అవార్డులు, పురస్కారాలు సాహిత్య బాధ్యతలను మరింత పెంచిందని సీతామహాలక్ష్మి అన్నారు. పురస్కార గ్రహీత సీతామహాలక్ష్మిని స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: సాయిబాబా ఆలయ 4వ వార్షికోత్సవాన్ని బిక్కవోలులో ఊలపల్లి రోడ్డు జంక్షన్ వద్ద 4వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయిబాబాకు పంచామృత అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వైజాగ్ అబ్బు, పాలచర్ల రామకృష్ణా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం



బలభద్రపురంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

బిక్కవోలు: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన అవసరమని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు జి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని బలభద్రపురంలోని వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 78 మంది వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలోని వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం

సీటీఆర్ఐ: తెలుగు భాష ఖ్యాతిని ఇనుమడింపజేసిన గిడుగు రామ్మూర్తి పంతులు సేవలు చిరస్మరణీయమని ఇండో ఇజ్రాయేలు ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ డెక్కపాటి ఆడమ్స్ అన్నారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ విప్పర్తి ఐజక్ న్యూటన్ పండుకు గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత సాఫల్య పురస్కారం అందించారు. పాన్ ఇండియన్ సోషియే కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

307 మందికి వైద్య సేవలు



ఉచిత వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం నిర్వహించిన శ్రీరామకృష్ణ మఠం నిర్వహించిన వైద్య శిబిరంలో 244 మంది, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 63 మంది వైద్య సేవలు పొందారు. సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ వైద్యసేవలు అందించారు. శ్రీరామకృష్ణ మఠం వారి శిబిరంలో రోగులకు వివిధ వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కంటి వైద్య శిబిరంలో 20 మందికి క్యాటరాక్ట్ అపరేషన్లు అవసరమని గుర్తించి, ఉచిత అపరేషన్ల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ వైద్యశిబిరాల నిర్వహణకు ఏఎస్ఎం బండి మంగ, ఆశ్రమ ప్రతినిధి జి.సుశీలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు

రఘుదేవపురం – సీతానగరం రోడ్డు ఛిద్రం



రఘుదేవపురం వద్ద గోతులుపడిన రోడ్డుపై అధిక లోడుతో వెళుతున్న వాహనం

సీతానగరం: రఘుదేవపురం – సీతానగరం ఆర్ అండ్‌బీ రోడ్డు కిలోమీటరున్నర మేర గోతులమయమవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాలు గోతుల్లో పడి వెళుతుంటే రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవనాలు అదురుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. భారీ లోడుతో వెళుతున్న వాహనాలు గోతుల్లో పడి ఎక్కడ తిరగబడతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. రాజమహేంద్రవరం నుంచి రఘుదేవపురం శివారు వరకు నాలుగు లైన్ల రోడ్డుపై సుఖవంతమైన ప్రయాణం చేసి, రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు రోడ్డుపై ప్రయాణం నరకమేనని వాహనదారులు బాహాటంగా విమర్శిస్తున్నారు. కిలోమీటరున్నర మేర రోడ్డు వేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా తాత్కాలికంగా గోతులను పూడ్చించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు